ప్రైవేటు ఉద్యోగాల సంఘం గ్రేటర్ ఉపాధ్యక్షురాలిగా సంధ్యారాణి



అంబర్‌పేట: తెలంగాణ రాష్ట్ర ప్రైవేటు ఉద్యోగుల సంఘం మహిళ విభాగం హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షురాలిగా సంధ్యరాణి నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఆమె నియమాకాన్ని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంధం రాములు ఖారారు చేశారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ.. తనకు అప్పగించిన బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తిస్తానని పేర్కొన్నారు. ప్రైవేటు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

ఓయూలో జైపాల్ రెడ్డి వర్ధంతి

ఉస్మానియా యూనివర్సిటీ: మాజీ కేంద్ర మంత్రి, జైపాల్ రెడ్డి వర్ధంతిని ఓయూలో సోమవారం విద్యార్థులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ కాలేజీ ఎదుట కాంగ్రెస్ నాయకుడు వలిగొండ నరసింహ జైపాల్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు నందు, ఆనర్స్, మహిపాల్, మహేశ్, విష్ణు, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలి



బాగ్‌అంబర్‌పేట యూపీహెచ్‌సీలో జరిగిన సమీక్షలో కార్పొరేటర్లు

అంబర్‌పేట: సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్లు పద్మా వెంకట్‌రెడ్డి, విజయ్‌కుమార్‌గౌడ్ సోమవారం వైద్య అధికారులు, సిబ్బందికి సూచించారు. బాగ్‌అంబర్‌పేటలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. వర్షకాలంలో ప్రబలే వ్యాధుల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ అభ్యర్థికి అవకాశం ఇవ్వండి

ఉస్మానియా యూనివర్సిటీ: బీసీల అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే ప్రధాన రాజకీయ పార్టీలు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీసీ నేతలకు అవకాశం ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు అన్ని రాజకీయ పార్టీలు తమను మోసం చేశాయని ఇంకా రాజకీయ అవకాశాలు కల్పించకుంటే పార్టీలు కనుమరుగు అవుతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి నేతలు గొడుగు మహేశ్‌యాదవ్, పాలకూరి కిరణ్, సాయి, అనంతుల మహేశ్ పాల్గొన్నారు.

పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడిగా రాకేష్



ముషీరాబాద్: ప్రగతి శీల యువజన సంఘం(పీవైఎల్) రాష్ట్ర అధ్యక్షులుగా ఖమ్మం జిల్లాకు ఎస్‌వీ రాకేష్, ప్రధాన కార్యదర్శిగా నారాయణపేట్‌కు చెందిన పెద్దింటి రామకృష్ణ ఎన్నికయ్యారు. రెండు రోజుల పాటు హైదరాబాద్‌లోని మార్క్స్ భవన్‌లో పీవైఎల్ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాలు జరిగాయి. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఎం.రవికుమార్, ప్రతాప్, జె.భరత్, కార్యదర్శులుగా బీఎస్ కృష్ణ, కుర్సా రామకృష్ణ, పెండ్యాల రమేష్, కోశాధికారిగా నవీన్‌తో పాటు మరో 12 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఆగస్టు 1న తలపెట్టిన 'హలో బీసీ విద్యార్థి–చలో ఢిల్లీ' పోస్టర్‌ను బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్మబోయిన సైదులుయాదవ్ ఆధ్వర్యంలో ఓయూలో సోమవారం ఆవిష్కరించారు. ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన కార్యక్రమానికి తెలంగాణ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, ఆల్ ఇండియా ఓబీసీ జేఏసీ చైర్మన్ డా.అవ్వారు వేణుకుమార్, ఓయూ ప్రొఫెసర్లు, విద్యార్థి నాయకులు హాజరై మాట్లాడుతూ.. ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే బీసీల 42 శాతం రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించి 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎస్‌పీ నేత బారీ అశోక్‌యాదవ్, వీజేఎస్ ఓయూ అధ్యక్షుడు రమేశ్, బీసీఎస్ఎఫ్ నేత గణేశ్, సురేశ్, అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం

అడ్డగుట్ట: సికింద్రాబాద్ డివిజన్ ఎల్‌ఐసీ ఆధ్వర్యంలో సౌత్ సెంట్రల్ జోనల్ అథ్లెటిక్స్ అండ్ వాలీబాల్ సెలక్షన్ ట్రయల్స్–2025 పోటీలు సికింద్రాబాద్‌లోని ఆర్ఆర్‌సీ గ్రౌండ్‌లో సోమవారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా సౌత్ సెంట్రల్ జోన్ మేనేజర్ పునీత్ కుమార్ జెండాను ఆవిష్కరించి మాట్లాడుతూ..సోమ, మంగళవారాల్లోనూ పోటీలు జరుగుతాయని విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ మేనేజర్ మధుసూదన్, మేనేజర్ శాంతి ప్రియ, ఉమాదేవి, చంద్రశేఖర్, స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు మెంబర్స్ సురేశ్, శర్మ పాల్గొన్నారు.



విరిగిపోయిన బెంచీలు, పిల్లల ఆట పరికరాలు



ఎడారిగా మారిన పార్కు

పచ్చదనం కనుమరుగు

● అపరిశుభ్రంగా పర్వరీష్‌బాగ్ కాలనీ పార్కు ● పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు



పర్వరీష్ బాగ్ కాలనీ పార్కు

అపరిశుభ్రంగా మారిన పార్కు

కాచిగూడ: కాచిగూడ డివిజన్‌లోని పర్వరీష్‌బాగ్ కాలనీ పార్కులో పచ్చదనం కరువైంది. జీహెచ్‌ఎంసీ, ఉద్యానశాఖ అధికారుల పర్యవేక్షణ, నిర్లక్ష్యం ఫలితంగా పచ్చదనంతో కళకళలాడాల్సిన పార్కు అపరిశుభ్రంగా, ఎడారిగా మారింది. వర్షాకాలం ప్రారంభమైన పార్కులో పచ్చదనం పెంచాలనే ఆలోచన అధికారులకు రాకపోవడం దురదృష్టకరమని కాలనీవాసులు వాపోతున్నారు. నిత్యం ఆడుకోవడానికి వచ్చే పిల్లలు, ఉదయం, సాయంత్రం వేళల్లో వచ్చే సీనియర్ సిటిజన్స్‌కు ఆహ్లాదకరమైన వాతావరణం లేక వచ్చిన వారు వెంటనే ఇంటిదారి పడుతున్నారు. పార్కు ఉన్న ఉపయోగపడకపోవడంతో అధికారుల తీరుపై స్థానిక ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పార్కు వద్ద దుర్వాసన..

పార్కును ప్రశాంతమైన, ఆహ్లాదకరంగా, మనశాంతిని పంచే విధంగా ఉండాల్సిన పార్కు వద్ద రహదారి వెంట వెళ్లే పాదచారులు మూత్ర విసర్జన చేస్తూ.. కొంత మంది పార్కు వద్ద చెత్తను వేస్తుండటంతో అక్కడి ప్రశాంతమైన వాతావరణాన్ని కలుషితం చేస్తున్నారు. దీంతో ప్రశాంతత కోసం పార్కు వద్దకు వచ్చే సందర్శకులు దుర్వాసనను భరించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పార్కుకు వస్తే రోగాలు కొనితెచ్చుకునే పరిస్థితి ఏర్పడుతుందని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ అధికారులు దృష్టి సారించి నిరుపయోగంగా ఉన్న పర్వరీష్ కాలనీ పార్కు అందరికి ఉపయోగపడేలా అభివృద్ధిలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం



రాహుల్‌గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వీహెచ్, కాంగ్రెస్ నాయకులు

అంబర్‌పేట: దేశంలో సుదీర్ఘ పాదయాత్ర చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అవసరమని గుర్తించిన నేత రాహుల్‌గాంధీ అని మాజీ ఎంపీ వి.హనుమంతారావు అన్నారు. రాహుల్‌గాంధీ మార్గదర్శకంలో సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో కులగణన చేపట్టి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఆర్డినెన్స్ తేవడం చరిత్రాత్మకమని అన్నారు. సోమవారం అంబర్‌పేట అలీకేఫ్ చౌరస్తాలో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద రాహుల్‌గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి వీహెచ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి 21 పాల బిందెలతో రాహుల్‌గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వీహెచ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీతోనే బడుగు, బలహీన వర్గాలకు సామాజిక న్యాయం దక్కుతుందన్నారు. దానికి 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ ఆర్డినెన్స్ తేవడం నిదర్శనమని తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ప్రచార ఆర్భాటలు తప్ప పేదల అభ్యున్నతికి చేసేదేముండదని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆర్.లక్ష్మణ్ యాదవ్, శంభుల శ్రీకాంత్‌గౌడ్, దిడ్డి రాంబాబు, తొలుపునూరి కృష్ణగౌడ్, మురళీకృష్ణ, రామ్మోహన్, తోట జగన్నాథం, బావి ధన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

భారత సేవాశ్రమ్ సేవలు అభినందనీయం



పుస్తకాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ జి.రచనశ్రీ, స్వామి వెంకటేశ్వరనంద్

కవాడిగూడ: నిరుపేద విద్యార్థులు, వరద బాధితులను ఆదుకునేందుకు భారత్ సేవాశ్రమ్ ఆధ్వర్యంలో చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ అన్నారు. భారత్ సేవాశ్రమ్ ఆధ్వర్యంలో సోమవారం దోమలగూడ పంకజ్ మెమోరియల్ ప్రభుత్వ పాఠశాలతో పాటు మరో పాఠశాలకు చెందిన విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌తో పాటు సేవాశ్రమ్ నగర కార్యదర్శి స్వామి వెంకటేశ్వరనంద్, మాజీ కార్పొరేటర్ రవీందర్, బీజేపీ నాయకులు జి.వెంకటేష్, పరిమల్ కుమార్, ఎంసీ మహేందర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● ముషీరాబాద్ డీఎంసీ రామానుజులరెడ్డి
● ముషీరాబాద్ సర్కిల్ స్లమ్ లెవల్ ఫెడరేషన్ నూతన కమిటీ ఎన్నిక



ముషీరాబాద్ డీఎంసీ రామానుజులరెడ్డితో సర్కిల్ స్లమ్ లెవల్ ఫెడరేషన్ నూతన కమిటీ సభ్యులు

ముషీరాబాద్: ముషీరాబాద్ సర్కిల్ స్లమ్ లెవల్ ఫెడరేషన్ (ఎస్ఎల్ఎఫ్) నూతన కమిటీ ఎన్నికైంది. సోమవారం సర్కిల్ కార్యాలయంలో డీఎంసీ రామానుజులరెడ్డి, యూసీడీ అధికారి సుధాకర్ సమక్షంలో జరిగిన ఎన్నికల్లో 24 మంది స్లమ్ లెవల్ ఫెడరేషన్ సభ్యులలో 17 మంది సభ్యులు హాజరై నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా ఎ.పద్మ, ప్రధాన కార్యదర్శిగా రేఖారెడ్డి, ఉపాధ్యక్షులుగా పి.విమల, సంయుక్త కార్యదర్శిగా పుష్పలత, కోశాధికారిగా టి.పుష్ప, కమిటీ సభ్యులుగా ఎస్.రాజేశ్వరిగౌడ్, వై.నీరజ, ఎస్.సరిత, జి.విక్టోరియారాణి, విజయలక్ష్మి, లావణ్య, ప్రియ తదితరులు ఎన్నికయ్యారు. వీరి పదవి కాలం ఐదేళ్ల పాటు ఉండనుంది. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో నూతన మహిళా సంఘాల ఏర్పాటు, మహిళల స్వయం ఉపాధి, వీధి వ్యాపారుల గుర్తింపు, ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు వంటి కార్యక్రమాలు సక్రమంగా జరిగేలా చూస్తామన్నారు. సర్కిల్ పరిధిలోని 1350 గ్రూపులు సక్రమంగా పని చేసేట్లు చూస్తూ గ్రూప్ సభ్యుల అభివృద్ధి, తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించేలా చూస్తామని తెలిపారు.

కమిటీలు చురుకుగా పని చేసేలా పర్యవేక్షించాలి...

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు మహిళల సంక్షేమం, స్వయం ఉపాధి కోసం చేపడుతున్న పథకాలను మహిళలకు తెలియజేసి అర్హులైన వారికి అందించేలా నూతన స్లమ్ లెవల్ కమిటీ కృషి చేయాలని ముషీరాబాద్ డీఎంసీ రామానుజులరెడ్డి సూచించారు. సర్కిల్ పరిధిలోని 24 స్లమ్ లెవల్ ఫెడరేషన్ కమిటీలు చురుకుగా పని చేసేలా నూతన కమిటీ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, నిబంధనల ప్రకారం కమిటీ సమావేశాలు నిర్వహించాలన్నారు. ప్రతి సమావేశానికి కమిటీ సభ్యులందరూ హాజరుకావాలని రానివారిని నిబంధనల ప్రకారం తొలగించి కొత్త వారికి అవకాశం కల్పించాలని సూచించారు.

మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తూ యువకుల హల్‌చల్

అదుపులోకి తీసుకున్న మధురానగర్ పోలీసులు

వెంగళరావునగర్: మద్యం సేవించి డ్రైవింగ్ చేయడమే కాకుండా రోడ్డుపై హల్‌చల్ చేసిన యువకులను మధురానగర్ పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి ఎస్ఆర్‌నగర్ పోలీసులు మైత్రీవనం ప్రధాన రహదారిపై డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో విజయవాడ మధురానగర్‌కు చెందిన హరిహరన్ అతడి మిత్రులు ఒకే వాహనంపై వస్తున్నారు. పోలీసులు అతడిని ఆపి తనిఖీ చేయడానికి ప్రయత్నించగా రోడ్డుపై హల్‌చల్ చేశారు. పోలీసు ఫోన్ సైతం పగులగొట్టారు. దీంతో మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా స్థానిక పోలీసులు యువకులను అదుపులోనికి తీసుకుని కేసు నమోదు చేశారు.

ఉచిత విద్యాహక్కు చట్టం అమలు చేయాలి



డీఈఓ రోహిణికి వినతిపత్రం అందజేస్తున్న సిరిగిరి శ్యామ్

ముషీరాబాద్: ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఉచిత విద్యాహక్కు చట్టం అమలు చేయాలని భారత ప్రభుత్వం జీఓ నం.44ను విడుదల చేసింది. హైదరాబాద్ జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలల్లో ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు సిరిగిరి శ్యామ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు డీఈఓ ఆర్.రోహిణిని సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు.

మేజర్ కవితకు సన్మానం



కవితను సన్మానిస్తున్న బండారు దత్తాత్రేయ

ముషీరాబాద్: భారత సైన్యంలో వైద్యాధికారి కాగా పని చేస్తున్న ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన మేజర్ కవితను హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ సోమవారం రాంనగర్‌లోని తన నివాసంలో ఘనంగా సన్మానించారు. ఇటీవల కల్నల్ రణవీర్ సింగ్ జమ్వాల్ నేతృత్వంలో నిర్వహించిన 28రోజులలో 1040కిలోమీటర్ల బ్రహ్మపుత్ర నదిని ఈది ప్రపంచ రికార్డును నెలకొల్పారు. దీంతో బండారు దత్తాత్రేయ కవితను అభినందించి సన్మానించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

అబిడ్స్: రిజిస్ట్రేషన్ శాఖలో ఉన్న ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీఎన్జీఓస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ కోరారు. ఈ మేరకు సోమవారం రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారి రాజీవ్‌గాంధీ హన్మంతును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగులకు కేటాయించిన ఎన్నికల విధులను రద్దు చేయాలన్నారు.

ఫుడ్ పాయిజన్‌పై సీఎం స్పందించాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

కాచిగూడ: నాగర్ కర్నూల్ జిల్లా ఉయ్యాలవాడ గురుకుల పాఠశాలలో జరిగిన ఫుడ్ పాయిజన్‌పై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి గురుకులాల్లో మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం విజ్ఞప్తి చేశారు. పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కారణంగా వంద మందికి పైగా విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని అన్నారు. వారికి ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా హాస్టల్స్‌లలో ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్నా ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. జూలై 21న సంగారెడ్డి జిల్లా నాగల్గిద్ద ఆదర్శ పాఠశాల హాస్టల్‌లో చికెన్ తిన్న అనంతరం 11మంది ఇంటర్ విద్యార్థులు వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురై ఆసుపత్రి పాలయ్యారని తెలిపారు. అదే విధంగా మంచిర్యాల జిల్లా గిరిజన ఆశ్రమ పాఠశాలలో పురుగుల అన్నం తినడం వల్ల ముగ్గురు విద్యార్థినులు ఆస్పత్రి పాలయ్యారని ఆయన పేర్కొన్నారు.

ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి



జన్ ఆరోగ్య సమితి సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ ఉమా రమేష్‌యాదవ్

కాచిగూడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అందిస్తున్న ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కార్పొరేటర్ ఉమా రమేష్‌యాదవ్ కోరారు. సోమవారం సుల్తాన్‌బజార్ యూపీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన జన్ ఆరోగ్య సమితి సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పేదలకు మరిన్ని మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా వైద్య అధికారులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మనోజ్ రెడ్డి, డాక్టర్ సాయి బాబ, డాక్టర్ వసంత కుమార్, జీహెచ్‌ఎంసీ ఎస్ఎస్ తిరుపతి నాయక్, ప్రభుత్వ పాఠశాల టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మురుగు సమస్యను పట్టించుకోకపోతే ఎట్లా.?



అంబర్‌పేట డివిజన్ చెన్నారెడ్డినగర్‌లో నిరసన తెలియజేస్తున్న బీజేపీ నేతలు

అంబర్‌పేట: కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంబర్‌పేట డివిజన్ చెన్నారెడ్డినగర్‌లో నెల క్రితం కొత్త రోడ్డు వేయడానికి చేపట్టిన తవ్వకాలతో డ్రైనేజీ పైపులైన్ ధ్వంసమయ్యింది. దీంతో చెన్నారెడ్డినగర్‌లో మురుగుతో రోడ్డు చెరువును తలపిస్తోంది. స్థానికులు దుర్గంధం భరించలేక అవస్థలు పడుతున్నారు. దీనిపై స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో బీజేపీ నేతలు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎందుకు నిర్లక్ష్యంగా ఉంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నరేష్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో నాయకులు జి.ఆనంద్‌గౌడ్, నాగభూషణంచారి, యశ్వంత్, మైలారం రాజు, నవీన్‌రెడ్డి, దయాకర్‌యాదవ్, భిక్షపతి, వెంకటస్వామిగౌడ్, శ్రీకాంత్, రామచందర్‌గుప్తా, పెంటం రాజు తదితరులు పాల్గొన్నారు.

మసీద్ పరిసరాల్లో మౌలిక వసతులు కల్పిస్తాం



ఖాద్రీబాగ్‌లో మసీదు ప్రహరీ సమస్య తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: మసీదు పరిసరాల్లో సౌకర్యాల కల్పనకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. సోమవారం గోల్నాక డివిజన్ ఖాద్రీబాగ్‌లో ఉన్న మసీద పరిసరాల్లో పలు సమస్యలు ఉన్నట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే ఆ ప్రాంతంలో పర్యటించారు. మసీదు కమిటీ ప్రతినిధులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మసీదు ప్రహరీగోడ శిథిలావస్థకు చేరిందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో స్పందించి నూతన ప్రహరీ నిర్మించేందుకు తన వంతు చేయూతనిస్తానని అన్నారు. అలాగే మసీదు పరిసరాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులతో పాటు మసీదు కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

దోస్త్ స్పెషల్ ఫేజ్ అడ్మిషన్లు ప్రారంభం

అబిడ్స్: నాంపల్లి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి దోస్త్ స్పెషల్ ఫేజ్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రముఖర్జి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్మీడియేట్ పూర్తి చేసిన విద్యార్థినులు అందరూ ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. బీఏ, బికాం, (సీ.ఏ) బీబీఏ, బీఎస్సీ (ఫిజికల్ సైన్సెస్), బీఎస్సీ (లైఫ్‌సైన్సెస్), కంప్యూటర్ సైన్సెస్ వివిధ కోర్సుల్లో సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకునేవారు ఫోన్‌నెంబర్లు 70329 60368, 98668 92692, 80193 21770లకు ఫోన్‌చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వివిధ కోర్సుల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్న వాళ్లకి ఆగస్టు 3వ తేదీన సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు.


బహుజన విద్యార్థులకు అవకాశాలు కల్పించండి

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో విద్య, ఉపాధి, ఉద్యోగాల్లో బహుజన విద్యార్థులకు అవకాశాలు కల్పించాలని బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బీఎస్ఎఫ్ఐ) నాయకులు డిమాండ్ చేశారు. ఓయూ ఆర్ట్స్ కాలేజీలో బీఎస్ఎఫ్ఐ జాతీయ కమిటీ ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా విద్యా రంగ సమస్యలపై చర్చించారు.

బీఎస్ఎఫ్ఐ నూతన కార్యవర్గం

ఓయూలో బీఎస్ఎఫ్ఐ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా శార్దాని రాము, ఉపాధ్యక్షుడిగా ప్రేమానంద్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నేషనల్ కోఆర్డినేటర్ కరుణాకర్ బహుజన్, స్టేట్ జనరల్ సెక్రటరీ దాసరి రాజశేఖర్, చిలుముల అజయ్, గ్రేటర్ అధ్యక్షుడు సాపకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రంగస్థల ప్రముఖులకు నివాళి



ప్రముఖులకు నివాళులర్పిస్తున్న ఆచార్య కోట్ల హనుమంతరావు

నాంపల్లి: తెలుగు విశ్వవిద్యాలయం ప్రాంగణంలో సోమవారం రంగస్థల కళల శాఖ ఆధ్వర్యంలో రంగస్థల కళల శాఖ పూర్వ శాఖాధిపతులు జె.వి.సోమయాజులు, డి.ఎస్.ఎన్.శర్మ, దేవదాసు కనకాల, పూర్వ అధ్యాపకులు జె.వి.రమణమూర్తి, డి.శ్రీనివాస దీక్షిత్ జయంతులను పురస్కరించుకుని స్మారక ప్రసంగాల సభను ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా తెలుగు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు హాజరై రంగస్థల ప్రముఖుల చిత్రపటాలకు నివాళులర్పించి ప్రసంగించారు. రంగస్థల కళల శాఖ పురోభివృద్ధికి, విద్యార్థులను తీర్చిదిద్దడానికి వారు చేసిన కృషిని, వారితో తనకున్న అనుబంధాలను ఆయన గుర్తు చేసుకున్నారు. రంగస్థల కళల శాఖ శాఖాధిపతి డాక్టర్ బి.హెచ్.పద్మప్రియ మాట్లాడుతూ..ఆయా అధ్యాపకుల ఆధ్వర్యంలో నాటకాలు చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రంగస్థల కళల శాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజు, శ్రీధర్ దీక్షిత్, సుజాత దీక్షిత్, వి.ధనరాజ్, శోభన్, శివ ప్రసాద్, నేహాల్, సాయి, శ్రీకర్ పాల్గొన్నారు.

జీఎస్ఎన్ శాస్త్రి మృతి నాటక రంగానికి తీరని లోటు



జీఎస్ఎన్ శాస్త్రి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళా సంస్థల ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: రంగస్థల ప్రయోక్త నాటక, నాటక దర్శకుడు గరికపాటి సుబ్బ నర్సింహ శాస్త్రి మృతి నాటక రంగానికి తీరని లోటు అని పలువురు వక్తలు అన్నారు. సోమవారం రవీంద్ర భారతిలో కిన్నెర ఆర్ట్ థియేటర్స్, యువ కళావాహిని, కళా విపంచి, శ్రీ కళా నికేతన్ సంస్థల ఆధ్వర్యంలో గరికపాటి సుబ్బ నర్సింహ శాస్త్రి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జీఎస్ఎన్ శాస్త్రితో ఉన్న జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వంశీ సంస్థల వ్యవస్థాపకులు వంశీ రామరాజు, కిన్నెర ఆర్ట్ థియేటర్స్ కార్యదర్శి మద్దాలి రఘురామ్, యువ కళావాహిని అధ్యక్షులు లంకా లక్ష్మీనారాయణ, యువ కళావాహిని అధ్యక్షులు సాయి శ్యామ్‌ప్రసాద్, కళానికేతన్ అధ్యక్షులు నర్సింహారావు, నిర్వాహకులు శివకుమార్ శాస్త్రి పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9010463222